INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:4(1), April:2021
Online Copy Available: www.ijmer.in
Digital certificate of publication:http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf

# తెలుగు కన్నడముల సాహిత్య బాంధవ్యం

రాఘవేంద్ర రావు
తెలుగు ఉపన్యాసకులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
కూకట్ పల్లి

## పరిచయం

భారత రాజ్యాంగం గుర్తించిన అధికారిక భాషలలో తెలుగు, కన్నడ భాషలు కూడా కలవు. ఈ రెండు భాషలను మాట్లాడు ప్రదేశములు ప్రక్కప్రక్కనే ఉన్నవి. భాషాతత్వమును అనుసరించి కూడా ఒకే భాషా కుటుంబమునకు చెందినవి. ఈ రెండు ప్రాంతములు అప్పుడప్పుడు ఒకేరాజుల ఏలుబడిలో ఉండేవి. సాంస్కృతికంగా పరస్పరం బలమైన సంబంధాలను కలిగియున్నవి. భాషకు స్థిర రూపమును కలిగించు లిపి దాదాపు ఒకే రకముగా ఉన్నది. సాహిత్య సంప్రదాయములు దగ్గర దగ్గరగా ఉన్నవి. ఈ రెండు భాషలలో సాహిత్యం గ్రంథరూపంలో సంస్కృత ప్రభావంతోనే పుట్టి పెరిగింది. ఈవిధంగా పరిశీలిస్తే అనేక రూపాలలో తెలుగు కన్నడ భాషల బాంధవ్యము మనకు మరింత స్పష్టంగా కనబడుతుంది.

రాజకీయంగానూ,సాంస్కృతికంగానూ తెలుగు, కన్నడ ప్రాంతముల మధ్యగల సంబంధములు అతి ప్రాచీనమైనవి. అట్టి సంబంధమే మనకు భాష, సాహిత్యములలో కూడా కనబడును. చారిత్రకంగా పరిశీలిస్తే ఒక్కోసారి తెలుగు ప్రాంతములు కన్నడ రాజుల ఏలుబడిలో నుండుట, కన్నడ ప్రాంతములు తెలుగు రాజుల పాలనలో నుండుటను గుర్తించవచ్చును. భాషను పురస్కరించుకొని తెలుగు వారికీ, కన్నడిగులు మధ్య స్వ, పర భేదములు చరిత్రలో కనబడవు. ఆరోజులలో ప్రభువుల ఆశ్రయములో ఉభయ భాషల వారికీ సమాన గౌరవము లభించినది. కన్నడ భాషలో ఆదికవి యగు పంప మహాకవి జన్మస్థలము వేంగినాడు. అతనికి ఆశ్రయమునిచ్చిన కన్నడ ప్రభువు రాజధాని తెలుగునాటనున్న వేములవాడ. పొన్న, నాగవర్మ వంటి ప్రఖ్యాత కన్నడ కవులు తెలుగు ప్రాంతమునకు చెందినవారే. నన్నయభట్టు, అతనికి భారత రచనలో సహకరించిన నారాయణ భట్టు కన్నడదేశంతో, కన్నడభాషతోసంబంధం కలిగిన వారే.

ఈ విధంగా పెనవేసుకున్న తెలుగు, కన్నడ భాషాసంబంధాలను పరిశీలిద్దాం.

## గాథాసప్తశతి

హాలుని గాథాసప్తశతి లోని కొన్ని పదాలు, కన్నడ ధాతువులని కన్నడ భాషాభిజ్ఞులు పేర్కొన్నారు. కానీ అవి పరిశీలిస్తే తెలుగు శబ్దాలుగా కూడా కనబడతాయి. ఉదాహరణకు : పొట్టే (పొట్ట),పెట్టు (పెట్టు/దెబ్బ)అనునవి తెలుగులో ఏ అర్థంలో వ్యవహరింప బడుతున్నవో కన్నడంలో కూడా అదేవిధంగా వ్యవహారంలో నున్నవి. దీనిని బట్టి తెలుగు కన్నడముల మధ్య భాషా సాన్నిహిత్యం ప్రాచీనకాలంలోనూ ఏ స్థాయిలో ఉండిందో అవగతం అవుతుంది.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:4(1), April:2021
Online Copy Available: www.ijmer.in
Digital certificate of publication:http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf

**శాసనములు**

బెంగుళూరు, కోలారు ప్రాంతములలో అనేక తెలుగు శాసనములు లభించినవి. అలాగే ఓరుగల్లు, శ్రీశైలములలో కన్నడ శాసనములు కనిపించినవి. మహబూబునగర్ జిల్లాలోని మక్తల, పెద్దకడుమూరు, గద్వాల ప్రాంతములందు లభించిన శాసనములలో తెలుగు,కన్నడ పదములు కనిపించును.

**నన్నయ కాలము**

నన్నయ భట్టుకు మహాభారత రచనలో సహాయమునందించిన వాడూ, కవీభవజ్రాంకుశ బిరుదాంకితుడూ, రాజరాజనరేంద్రునిచే కోరుమిల్లి అగ్రహారమును పొందినవాడూ యగు నారాయణభట్టు కన్నడ దేశమునుండి వచ్చిన వాడే. నన్నయ, నారాయణ భట్టుల విద్యాభ్యాసం మైసూరు లో జరిగిందని ప్రముఖ కన్నడ సాహితీవేత్త కోదండరామయ్య గారు అన్నారు . కన్నడ సాహిత్యములో పంప, రన్న, పొన్న యను ముప్వురు కవులు రత్నత్రయమను పేర ప్రసిద్ధినొంది యున్నారు. వీరు పదవ శతాబ్దమునకు చెందినవారు. వీరిలో పంపకవికి మొదట పద్మ కవి యని పేరుండెనని కొందరి భావన. దీనిపై భిన్నవాదనలు ఉన్నవి.

పద్మకవి తెలుగులో జినేంద్ర పురాణమును రచించినట్లు తెలియుచున్నది. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు జినేంద్ర పురాణములోనిదిగా ఒక పద్యమును ఉదాహరించియున్నారు. ఒకవేళ అదే నిజమైతే పంపడు మొదటి తెలుగు కవి కావచ్చును.

హరినిలయంబును హరినిలయంబును
నిషధ రాధ్యంబును నిషధ రాధ్య
మప్సరోమయమును నప్సరోమయమును
వనవిలాసమును పావనవిలాస
మున్నతకరి శృంగమున్నతకరి శృంగ
మిందు కాంత స్రవ మిందు కాంత
మురుకలన కులంబు నురుకలన కులంబు
నంశు కాంత జ్యోతి నాం శు కాంత
మొనర నవశత సాహస్ర యోజనోన్న
తమును పదివేల యోజనమలరు వలము
గలిగి కనకాద్రి కిన్నూట తనరి
ప్రథితమై యొప్పు మందర పర్వతంబు.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:4(1), April:2021
Online Copy Available: www.ijmer.in
Digital certificate of publication:http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf

**శివకవియుగము**

శివకవులపై కన్నడ దేశంలో వచ్చిన మత సంస్కరణోద్యమ ప్రభావం అధికంగా కనబడుతుంది. బసవేశ్వరుని బోధనలు వీరి రచనలకు చోదక శక్తిగా పనిచేసినవి. తెలుగునాట నున్న శ్రీశైల క్షేత్రం వారికి కైలాస సమానం.

మల్లికార్జున పండితారాధ్యుడు,పాల్కురికి సోమనాథుడు ఇద్దరునూ తెలుగు, కన్నడములు రెండింటియందును ఉద్దండపండితులు, మహాకవులు. శివకవి యుగమున తెలుగు రచనలకు కన్నడనువాదములు , కన్నడ రచనలకు తెలుగు సేతలు వచ్చినవి.

శివకవులలో ఒకరగు మల్లికార్జున పండితారాధ్యుడు కన్నడ ప్రాంతమునకు చెందిన వాడు కాకపోయిననూ , తెనుగుననే కాక కన్నడమున గూడ శివతత్త్వసారమును రచించెను.

జ్ఞానం వైరాగ్యమెనాల్కేనా నొందిరద నాస్తిక స్థితి విషయాధీన దురాచారిగ యోగానందం దొరకలార్కుమే సర్వేశా!
(కన్నడ శివతత్త్వసారము )

జ్ఞానము వైరాగ్యము ననగానించుకలేని నాస్తిక స్థితి విషయాధీన దురాచారికి యోగానందము కలుగ నేర్చునయ్యా మహేశా!
( తెలుగు శివతత్త్వసారము )

తెలుగు, కన్నడముల సంబంధమును పాల్కురికి సోమనాథుడు స్థిరపరిచెనని చెప్పవచ్చు. బసవపురాణము కన్నడీకరింప బడినది. సోమనాథుని భృంగీశ్వరుని అవతారముగా కన్నడిగులు భావింతురు. కన్నడమున ఇతని పేర కొన్ని లఘుకృతులు ఉన్నవి. సద్గురురగళె, చెన్నబసవరగళె, గంగోత్పత్తిరగళె, శీల సంపాదనే, గణసహస్రనామ,పంచరత్న మొదలగునవి ఇతడి కన్నడ కృతులు. 19వ శతాబ్దము వరకు కన్నడకవులు తమ కృతులలో సోమనాథుని స్తుతించియున్నారు. ఇతడి జన్మస్థలము తెలుగు నాట నున్న పాల్కురికి అయినా తుముకూరు జిల్లాలోని హాలకుర్కి యని కన్నడిగుల మతము. ఇతని సమాధి కన్నడ నాటనే ఉన్నది.

తెలుగులో వరాహ పురాణమును రచించిన నందిమల్లయ, ఘంటసింగన లు శ్రీరంగపట్టణమున ఉండినట్లు కే.ఎస్. కోదండ రామయ్య గారు పేర్కొన్నారు. బెంగుళూరు నగర నిర్మాతగా పేరుగాంచిన పెద కెంపెగౌడ గంగ గౌరీ సంవాదమను యక్షగానమును తెలుగులో రచించినట్లు చెప్పబడినది.

**విజయనగరరాజులు**

తెలుగు వాఙ్మయమున శ్రీకృష్ణదేవరాయల యుగము స్వర్ణయుగముగా వాసికెక్కినది. హంపి రాజధానిగా గల్గిన విజయనగర రాజులు కన్నడిగులనిన తెలుగువారు శంకింతురు. అంతటి దృఢ సంబంధమును వారు తెలుగు కన్నడ

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:4(1), April:2021
Online Copy Available: www.ijmer.in
Digital certificate of publication:http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf

ప్రాంతముల నడుమ వారు కల్పించిరి. శ్రీకృష్ణదేవరాయలు తెలుగువారు గర్వించదగ్గ ఆముక్తమాల్యద యను ప్రబంధమును సృజించిరి. ఆంధ్రభోజుడని కీర్తిని బడసిరి.

**నాటకరంగము**

తెలుగు నాటక రంగమునకు బళ్లారి నగరమున ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు గారలు చేసిన సేవలు అవిస్మరణీయములు . సరసవినోదినీ సభ, సుమనోరమసభ యను నాటక సమాజములను స్థాపించి వాటిచే నాటకములను ప్రదర్శింప జేయుచుండిరి. ధర్మవరం రామకృష్ణమాచార్యులు ముప్పదికి పైగా నాటకములు రచించిరి.

తెలుగు సాహిత్యాభిమానులకు ఆదిభట్ల నారాయణదాసు నామధేయము చిరపరిచితము. హరికథా పితామహులుగా వారు సుప్రసిద్ధులు. సంస్కృతాంధ్రములలో నిరాఘాటంగా కవిత చెప్పగలిగిన సామర్థ్యం వారిది. దాసుగారికి శాశ్వత కీర్తిని సంపాదించిపెట్టినది హరికథయే. హరికతకు కథాంశముతోపాటు సంగీత జ్ఞానము, అభినయ కౌశలము విడదీయరాని యంగములు. వీరు నానారాజ సందర్శనము చేసి ఆయా రాజసభలలో సన్మానములు పొందిరి. ఆ సందర్భముగా మైసూరును దర్శించి రాజుచే సన్మానమునందిరి. మైసూరు నగరమును వర్ణించిరి. మైసూరు వర్ణన దండక రూపమున సాగినది. వారు బెంగుళూరు ,బళ్లారి నగరములను కూడా వర్ణించిరి.

**వాగ్గేయకారులు**

పురందరదాసులవారు కన్నడ నాట సుప్రసిద్ధ వాగ్గేయకారులు. వారు అన్నమాచార్యుల సమకాలికులు. అన్నమయ్య వలెనే తిరుమలను దర్శించి శ్రీనివాసునిపై అనేక దాసర పదములను రచించారు. వారి కృతుల ద్వారా కన్నడనాట మాధ్వ సాంప్రదాయ వైష్ణవులకు శ్రీనివాసుడు, తిరుపతి తిమ్మప్పగా కొంగుబంగారం.

కన్నడ నాడు మొదటినుండి తెలుగుకు పినతల్లి వంటిది. తుళు భాషలో తెలుగుకు సమాంతరమైన అనేక పదాలు కనబడతాయి. బెంగుళూరు నగరమును నిర్మించిన కెంపెగౌడ తెలుగులో ఒక యక్షగానాన్ని రచించాడని కొందరు పేర్కొన్నారు. బళ్లారి రాఘవ, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు గారలు తెలుగువారికి ఎంత దగ్గరివారో పూజనీయులో కన్నడిగులకూ అంతే. అంతేకాదు ముఖ్యంగా రెండు ప్రాంతాల సరిహద్దు గ్రామాలలో ఎవరి మాతృభాషా ఏదో గుర్తించడం దుస్సాధ్యం.

మైసూరు నగరమున నివసించియుండిన రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారు తెలుగు సాహిత్యమును సుసంపన్నం చేసిన వారనడంలో సందేహం ఉండవలసిన అవసరం లేదు. లబ్ధ ప్రతిష్ఠులైన మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి మాతృభాష తెలుగు.

ఆధునిక సాహిత్యము తెలుగులో వలెనే కన్నడ భాషలో కూడా ఆంగ్ల ప్రభావంతోనే మొదలయినది.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:4(1), April:2021
Online Copy Available: www.ijmer.in
Digital certificate of publication:http://ijmer.in/pdf/e-Certificate%20of%20Publication-IJMER.pdf

తెలుగు సాహిత్యంలో నవయుగ వైతాళికుడుగా పేరుపొందిన గురజాడ అప్పారావు ముత్యాలసరాలు అని నూతన ఛందస్సును ప్రవేశ పెట్టిన విషయం మనకు తెలుసు. అట్టి ముత్యాలసరాలకు మార్గసూచిగా కన్నడంలో జగన్నాథ దాసులవారు(1728-1809) రచించిన హరికథామృతసారము భామినీ షట్పది రూపంలో శతాబ్దం క్రితమే వెలుగులీనింది.

ఇరు భాషలలో నవల,కథ, నాటకము వంటి సాహిత్య ప్రక్రియలు ఆధునిక రూపాలతో జిజ్ఞాసువులను సృజన శీలురుగా తీర్చిదిద్దుతున్నాయి. ఏదిఏమైనా తెలుగు కన్నడ సాహిత్య బాంధవ్యాలు ఆది కాలం నుండి ఆధునిక కాలం వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నాయి.

దీనిని మరింత లోతుగా పరిశీలిస్తే మరెన్నో పరస్పర ప్రభావితాంశాలు కనబడుననడంలో సందేహమక్కరలేదు.

ఉపయుక్త గ్రంథ సూచి

1. కర్ణాటకాంధ్రసాహిత్యచరిత్ర: - ఆర్.శంకర నారాయణరాజు
2. కన్నడ సాహిత్య చరిత్రె : - శ్యామరాయ.